

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌కు అభినందనలు తెలుపుతున్న చామనపల్లి బీఆర్ఎస్ నాయకులు



జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు శుభాకాంక్షల వెల్లువ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలకు పలువురు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్, మెట్‌పల్లి పట్టణంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాక్షలు తెలిపి, శాలువాలు కప్పి సన్మానించారు.



బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు అభినందనలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ప్రజా సమస్యలపై పోరాడుతాం

- ప్రజా తీర్పును గౌరవిస్తాం
- ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బూరుగుపల్లిలో విలేకరుల సమావేశం
- కేసీఆర్ లేని తెలంగాణను ఊహించుకోలేక పోతున్నానంటూ కంటతడి



గంగాధర : బూరుగుపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, డిసెంబర్ 4: ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. కొట్లాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, కేసీఆర్ లేని తెలంగాణ రాష్ట్రాన్ని ఊహించుకోలేకపోతున్నానని కంటతడి పెట్టారు. ప్రాణం ఉన్నంతవరకు గులాబీ జెండాను మోస్తానని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసానిచ్చారు. గంగాధర మండలం బూరుగుపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉండి పని చేశానని, కార్యకర్తలకు ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మల్యాల జడ్పీటీసీ కొండపల్కల రామ్మోహన్‌రావు, గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు సాగి మహిపాల్‌రావు, గంట్ల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మేచినేని నవీన్‌రావు, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, జనగం శ్రీనివాస్, సర్పంచులు మిట్టపెల్లి సుదర్శన్, మడ్లపెల్లి గంగాధర్, ఎండీ నజీర్, వేముల దామోదర్, జోగు లక్ష్మీరాజం, నాయకులు ఇప్పనపెల్లి సాంబయ్య, ఆకుల మధుసూదన్, రామిడి సురేందర్, వేముల అంజి, బొల్లాడి శ్రీనివాస్‌రెడ్డి, దూలం శంకర్ గౌడ్, మడ్లపెల్లి రమేశ్, చిలుముల రమేశ్, సుంకె అనిల్, రేగుల తిరుపతి, కడపల మల్లేశం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా తీర్పును శిరసావహిస్తా

- కాంగ్రెస్ దుష్ప్రచారమే ఓటమికి కారణం
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, డిసెంబర్ 4: రామగుండం నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తానని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ గెలుపు కోసం నిరంతరం పని చేసిన కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ రుణపడి ఉంటానని అన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతల దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడమే తన ఓటమికి కారణమని చెప్పారు. ఆ పార్టీ ఇచ్చిన హామీలను నెర వేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కౌశికహరి, ఆముల నారాయణ, చల్ల రవీందర్ రెడ్డి, జేవీ రాజు, మూల విజయారెడ్డి, సరోజన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచిన కేటీఆర్‌కు శాసనసభ అభ్యర్థిత్వ ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు

- శాసనసభ అభ్యర్థిత్వ ధ్రువీకరణ పత్రం అందజేత

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 4: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సిరిసిల్లకు చెందిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సిరిసిల్ల శాసనసభ అభ్యర్థిత్వ ధ్రువీకరణ పత్రాన్ని కేటీఆర్‌కు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ సోమవారం భారత జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బీఆర్ఎస్ పక్షాన తన గెలుపునకు కృషి చేసినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి తనకు మరోసారి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

-జగిత్యాల రూరల్, డిసెంబర్ 4



# అధైర్య పడకండి.. అండగా ఉంటాం



మానకొండూర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- ప్రజా తీర్పును గౌరవిస్తాం
- సమస్యలపై పోరాడుతాం
- కాంగ్రెస్ తొలిసంతకం 6 గ్యారంటీలపైనే చేయాలి
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, డిసెంబర్ 4: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడవద్దని, పార్టీ ఎళ్లవేళలా మీకు అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ భరోసానిచ్చారు. మానకొండూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కోరుకున్న మార్పు, తీర్పును స్వాగతిస్తున్నామని, ఓటమిని కూడా ఒక బాధ్యతగా తీసుకుంటామని తెలిపారు. ప్రతిపక్షంలో ఉంటూనే ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు ఉద్యమకారుడిగా ఆశీర్వదించి రెండు సార్లు ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ కట్టబెట్టారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఅర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు నియోజకవర్గ పరిస్థితి ఎలా ఉన్నది? ఇప్పుడెలా ఉన్నదో గమనించాలని సూచించారు. నియోజకవర్గంలోని 146 గ్రామాల్లో కల్పించిన మౌలిక వసతులే అందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించారని వాపోయారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్టే తొలి సంతకం ఆరు గ్యారంటీలపైనే చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు రసమయి బాలకిషన్ స్థానికుడు కాదని ఓటమి చెందిన తరువాత నియోజకవర్గాన్ని విడిచిపెట్టి పారిపోతాడని గ్లోబల్ ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. పదేండ్ల పాటు నియోజకవర్గ ప్రజలకు సేవ చేశానని, నియోజకవర్గంలోని గుండారంలో నాకు వ్యవసాయ క్షేత్రం ఉందని, అక్కడ వ్యవసాయం చేసుకుంటూ ప్రజల మధ్యనే ఉంటూ.. ప్రజా సమస్యలపై పోరాడుతానని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ నాయకులు గెలిచిన ఉన్మాదంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఇండ్ల వద్దకు వెళ్లి పటాకులు కాలుస్తూ వారిని రెచ్చగొడుతున్నారని, ఇలాంటి దుర్మార్గమైన చర్యలు మానుకోవాలని హితువు పలికారు. సమావేశంలో గడ్డం నాగరాజు, జడ్పీటీసీలు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, లింగపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ఎంపీపీలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు గంట మహిపాల్, గంప వెంకన్న, సహకార సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, అనుబంధ సంఘాల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.